


బాలానగర్ నుంచి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మీదుగా మెట్రో రైల్ విస్తరించాలని పలు సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, దళిత సంఘాల ప్రతినిధులు ఐలయ్య గౌడ్, జేమ్స్, అంజన్న , జనార్ధన్, అశోక్ పాల్గొన్నారు.

**–జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 19**



ఇంటర్నేషనల్ 'రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ 2025' అవార్డును కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు తేజశ్రీ , ఖుషీ శర్మ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ క్రీడాకారులను అభినందించారు. **–కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి19**

**శివాజీకి ఘననివాళి**



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్/ కేపీహెచ్‌బీ కాలనీ: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. యువజన సంఘాలు, శివాజీ యూత్ అసోసియేషన్, వివిధ పార్టీల నేతల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేఎన్టీయూహెచ్‌లో స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం

జగద్గిరిగుట్ట :ప్రభుత్వ విద్యార్థులకు చేతిరాతలో ఉచితంగా శిక్షణ అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మక్దూంనగర్ ప్రభుత్వ పాఠశాలలో జితేందర్ హ్యాండ్ రైటింగ్ నిర్వాహకుడు ఒంపు మల్లయ్య ఆధ్వర్యంలో వారం రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, మల్లయ్యను అభినందించారు.

# ఘనంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుట్టినరోజు వేడుకలు

**పలు చోట్ల సేవా కార్యక్రమాలు.. మహా కుంభమేళాలో కుటుంబసమేతంగా ఎమ్మెల్యే కృష్ణారావు పుణ్యస్నానం..ప్రత్యేక పూజలు**



కుంభమేళాలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానం ఆచరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలాజీనగర్‌లో ఎమ్మెల్యే కృష్ణారావు పుట్టినరోజు వేడుకల్లో కార్పొరేటర్ శిరీషాబాబురావు, ప్రభాకర్ గౌడ్



మియాపూర్:కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకొని వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. వెంకటేశ్వరనగర్ బ్లాక్ నంబర్ 33 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పెన్నులను అందజేశారు. కార్పొరేటర్ మాధవరం రోజా దేవి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు. హైదర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు సిందం శ్రీకాంత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### కుంభమేళాలో..

కేపీహెచ్‌బీ కాలనీ:ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన పుట్టినరోజు సందర్భంగా కుంభమేళాలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు ఆచరించి..ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్ , హరీశ్ రావు ఎమ్మెల్సీ కవితలతోపాటు పలువురు ప్రముఖులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీ నగర్ మూసాపేట డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నేతల ఆధ్వర్యంలో అనాథాశ్రమాల్లో అన్నదానం చేశారు. కేపీహెచ్‌బీకాలనీలో కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు కార్యకర్తలతో కలిసి కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మూడో ఫేజ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జీఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాతూరి గోపి ఆధ్వర్యంలో శివానంద కుష్టు రోగుల పునరావాస కేంద్రంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ శిరీష బాబురావుల చేతుల మీదుగా పండ్లను పంపిణీ చేశారు.యువజన విభాగం ఆధ్వర్యంలో కే పీ హెచ్‌బీ కాలనీ 1,2 వ ఫేజ్ నేతాజీ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ శిరీషాబాబురావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగర్‌లో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



శివానంద కుష్టు రోగుల పునరావాస కేంద్రంలో పండ్ల పంపిణీ

**ఆక్రమణల కూల్చివేత**



బాచుపల్లి రోడ్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

దుండిగల్, ఫిబ్రవరి 19:నిజాంపేట విలేజ్, బాచుపల్లి రోడ్డులోని నిజాంపేట్ కమాన్ నుంచి గోకరాజు రంగరాజు కళాశాల చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన డబ్బాలు, ఇతర వాణిజ్య సముదాయాలను మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం తొలగించారు.

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్ పరిధి కాముని చెరువు కట్టను ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 908లో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గుర్తించిన అధికారులు.. బుధవారం కూల్చివేశారు.

# పాలమూరు బిడ్డలకు అండగా ఉంటా

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మియాపూర్, ఫిబ్రవరి 19: హైదరాబాద్ నగరానికి వలస వచ్చిన పాలమూరు బిడ్డలకు అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ జన్మభూమికాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ముంబై, పుణె నగరాల్లోనే కాకుండా దేశ విదేశాల్లో అనేక ఆకాశహర్మ్యాలను నిర్మించిన కూలీలు పాలమూరు కార్మికులేనన్నారు. ఎక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తే అక్కడికి వెళ్లి కూలి పని చేసుకొని జీవించే నిస్వార్థ జీవులు పాలమూరు వాసులన్నారు. నగరంలో పొట్టకూటి కోసం వచ్చి లక్షలాది సంఖ్యలో నివాసముంటున్న పాలమూరు వాసుల కష్ట సుఖాలు, సంక్షేమం కోసం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇటువంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంఘం సభ్యులకు, పాలమూరు వాసులకు అండగా ఉంటానని అన్నారు. పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘానికి తన ద్వారా 5 లక్షల రూపాయలు నిధిని సమకూరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక సభ్యులు ఎంఏ కరీం, గోపాస్ రవీందర్, సంకి సత్యం, గోపాస్ చంద్రశేఖర్, బంగారి బండి, దాసరి కుర్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి ఆస్తి పన్ను పరిష్కార వేదికలు

మియాపూర్: ఆస్తి పన్ను ముగింపు సహా సంబంధిత సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి చందానగర్ సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను పరిష్కార వేదికలను నిర్వహిస్తున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 22, వచ్చేనెల 1, 8 15, 22, 29 తేదీల్లో సర్కిల్ కార్యాలయంలో ఈ పరిష్కార వేదికలను నిర్వహిస్తున్నామని, పన్ను ముదింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీ కోరారు. ఆస్తి పన్ను ముదింపుతో పాటు, పన్ను సవరింపులు, ఇతరత్రా సమస్యలను వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చునని డీసీ పేర్కొన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే వేదికలో పన్ను విభాగం సిబ్బంది అందుబాటులో ఉండి, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు.

## నేడు ఆలయ వార్షికోత్సవం

మియాపూర్:ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్‌లో సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాలు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి సురభి రమేశ్‌రావు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజాధికాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# మల్కం తరహాలో చెరువుల సుందరీకరణ

**ఆహ్లాదానికి నెలవుగా తీర్చిదిద్దుతాం..వాకింగ్ ట్రాక్‌లు..చిన్నారుల కోసం ఆట పరికరాలు..జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి**

మియాపూర్ ,ఫిబ్రవరి 19: శేరిలింగంపల్లి జోన్ లో తటాకాలను పూర్తిస్థాయిలో సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మల్కం చెరువు తరహాలో గంగారం, పటేల్ కుంట చెరువులను అభివృద్ధిపరిచి ఆహ్లాదానికి నెలవుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి బుధవారం పటేల్ కుంట ,గంగారం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ నిధులతో చెరువుల అభివృద్ధి, సుందరీకరణ చర్యలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెరువుల విస్తీర్ణం గుర్తించి చుట్టూ పటిష్టమైన బండ్ ఏర్పాటు, లాన్, వాకింగ్ ట్రాక్, అందమైన విద్యుత్ లైట్లు, చిన్నారులకు ఆట పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి సమర్థమైన ప్రణాళికలను రూపొందించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. చెరువుల సుందరీకరణ, అభివృద్ధికి సంబంధించిన పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తుగా న్యాయపరమైన అంశాలన్నింటినీ పరిష్కరించి ముందుకు సాగాలని ఆదేశించారు. మాల్స్ ,హాల్స్ లకు ప్రత్యామ్నాయాలుగా పచ్చదనంతో ఆహ్లాదం అందించేలా చెరువుల సుందరీకరణ చేస్తామన్నారు. ప్రతి చెరువును పిక్నిక్ స్పాట్‌గా మలచి శేరిలింగంపల్లి జోన్ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసేలా చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు .వీటి పర్యవేక్షణ పై ఏర్పాటు చేసిన అధికారులు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా విజిలెన్స్ పెట్టాలని, చెరువుల పరిసరాలలో నిర్మాణ, ఇతర వ్యర్థాలు వేయకుండా పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి ,, ఏసీపీ నాగిరెడ్డి టీపీఎస్ లు కార్తీక్, శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ రవి, డిఈ దుర్గాప్రసాద్ ,ఇరిగేషన్ డీ ఈ నళిని, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని దుర్గం చెరువును హెచ్‌ఎండీఏ ,ఇరిగేషన్ అధికారులతో కలిసి జాయింట్ తనిఖీని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగునీరు చేరకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షించారు. ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మురుగునీటి డైవర్షన్ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు పరిసరాల్లో నివసించే ప్రజల నివాసాల నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా, స్వతహాగా పైప్ లైన్లతో డ్రైనేజీలకు అనుసంధానించుకునేలా అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ సీఈ రవీందర్ డిప్యూటీ శివకుమార్ రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ నళిని, ఏఈ పావని, డీసీ ముకుందరెడ్డి ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ అధికారులతో కలిసి మియాపూర్ పటేల్ చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

### చిన్నదామర చెరువు పరిశీలన

దుండిగల్: దుండిగల్‌లోని చిన్నదామర చెరువును ఇరిగేషన్ అధికారులు బుధవారం స్థానికులతో కలిసి పరిశీలించారు. చిన్నదామర చెరువులో ఇటీవల మురుగునీరు కలుస్తుండడంతో స్థానికులు అలుగును ఓపెన్ చేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు చెరువులు సందర్శించారు. త్వరలోనే చెరువు నీటిలో మురుగునీరు చేరకుండా చర్యలు చేపడతామన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ: మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భగత్ సింగ్‌నగర్ కాలనీ, సర్దార్ పటేల్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మ. 2 గంటల వరకు సర్దార్ నగర్ రాజీవ్‌గాంధీ నగర్ జీవన్ హైట్స్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని ఏఈ తెలిపారు.

మాదాపూర్: మార్తాండ నగర్, హనీఫ్ కాలనీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక నగర్, ప్రకాశ్ నగర్ వంటి ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ దీప్తి తెలిపారు. బావార్చి లైన్, వివేకానంద నగర్ కమ్యూనిటీ హాల్ తదితర చోట్ల ఉదయం 11 గం.నుంచి మ. 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనున్నట్లు ఏఈ తెలిపారు.

మియాపూర్: శేఖర్ కాలనీ, జన్మభూమి కాలనీ తదితర ప్రాంతాల్లో ఉ. 10 నుంచి 12:00 వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ షబాజ్ తెలిపారు.

జగద్గిరిగుట్ట: అంజయ్యనగర్, సోమయ్యనగర్ ప్రాంతాల్లో మ.ం 11 నుంచి 1 వరకు వరకు కరెంటు ఉండదని తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు గుర్తుతెలియని మృతదేహం లభ్యమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ మెట్రో స్టేషన్ పార్కులో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు మియాపూర్ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు .అతడి వద్ద ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. మియాపూర్ న్యూ ఆఫీస్ పెట్ ఆదిత్య నగర్ మెయిన్ రోడ్ లోని ముందు ఓ వ్యక్తి పడి ఉన్నాడని మియాపూర్ పోలీసులకు సమాచారం రాగా, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ వ్యక్తి సుమారు రెండు రోజుల కిందట మృతి చెందినట్లు దుర్వాసన వస్తుండడం గమనించారు .ఆ వ్యక్తి వివరాలు తెలియరాలేదు. దర్యాప్తు చేపట్టారు.

## బాలిక అదృశ్యం

మాదాపూర్: ఓ బాలిక ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఈ సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎన్‌వీ రమణ తెలిపిన వివరాల ప్రకారం.... మంజు దేవి, అమిత్ పర్వానిలకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె జుగుని(10) సంతానం. బతుకుతెరువు నిమిత్తం గత కొన్ని సంవత్సరాల కిందట మాదాపూర్‌కు వలస వచ్చి గుడిసెలో నివాసముంటున్నారు. ఈ నెల 16న జుగుని తల్లి పని నిమిత్తం ఊరికి వెళ్లింది. తన తల్లి ఇంట్లో లేని సమయంలో లో జుగుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈనెల 18 న ఊరి నుంచి తన ఇంటికి వచ్చిన తల్లి మంజు దేవికి కూతురు ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని అడిగింది. ఆచూకీ దొరకకపోవడంతో మంజు దేవి తన కూతురు అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT : MEDCHAL**
**O.S.No. 44 of 2025**

**Between:**
Smt. Multhumkar @ Manjakar Lavanya & others ...Plaintiffs
**AND**
Bonthapalli Shiva Kumar & another ...Defendants

**NOTICE**

To
To whomsoever it may concerned ...Defendant No. 2

Please take notice that the above named Plaintiffs filed a suit for declaration to declare them as the legal heirs of Smt Manjakar Sharadha, wife of the late Manjakar Shivaji and perpetual injunction against Bonthapalli Shiva Kumar & to whomsoever it may concerned and the above said suit is posted on 12-03-2025 for appearance and objections if any from whomsoever it may concerned.

Therefore, I hereby requested to whomsoever it may concerned to appear in the above said suit either in person or through an advocate on 12-03-2025 at 10.30 A.M., before the above Hon ble Court otherwise the matter will be decided in your absence as per law.

// BY ORDER OF HON'BLE COURT //
**Sd/- MATHI CHANDRA SEKHER, Advocate**
H.No. 5-281/1, Chandranagar, Chintal, Hyderabad-500 054,
**Ph: 9393804880.**